క్లుప్తంగా

బాధిత పోలీసు కుటుంబానికి ఆర్థిక సాయం


ఆర్థికసాయం అందచేస్తున్న ఏఎస్పీ

చిత్తూరు అర్బన్‌: మృతి చెందిన పోలీస్‌ కానిస్టేబుల్‌ కుటుంబానికి ఆ శాఖ ద్వారా రూ.లక్ష ఆర్థిక సాయాన్ని అందచేశారు. వినోద్‌ అనే కానిస్టేబుల్‌ నింద్ర స్టేషన్‌లో పనిచేస్తూ గత ఏడాది సెప్టెంబర్‌లో అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన భార్య కళావతికి గురువారం కార్పస్‌ ఫండ్‌ ద్వారా రూ.లక్ష ఆర్థిక సాయాన్ని ఏఎస్పీ రాజశేఖర్‌ రాజు అందచేశారు.

ఉపాధి పనుల్లో నాణ్యత పాటించాలి


మాట్లాడుతున్న ఏపీడీ సుబ్రమణ్యం

పాలసముద్రం: మండలంలో ఉపాధిహామీ పథకంలో చేస్తున్న పనులు నాణ్యతగా చేపట్టాలని ఏపీడీ సుబ్రమణ్యం తెలిపారు. గురువారం ఉపాధి హామీ సిబ్బందికి ఏపీఓ మార్గరెట్‌ ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఏపీడీ సుబ్రమణ్యం మాట్లాడుతూ జాబ్‌కార్డు కలిగిన ప్రతి కుటుంబానికి 100 రోజులు కల్పించాల్సిన బాధ్యత ఉపాధి హామీ సిబ్బందిపై ఉందన్నారు. ప్రస్తుత సీజన్‌లో నీరునిల్వ ఉండే పనులు చేయించాలని సూచించారు. కూలీలకు గిట్టుబాటు వచ్చే విధంగా కొలతలు ఇచ్చి పనులు చేయించాలని తెలిపారు. ముఖ్యంగా మస్టర్‌లో కొట్టివేతలు లేకుండా ఫీల్డ్‌ అసిస్టెంట్లు హాజరు నమోదు చేయాలని హెచ్చరించారు. కార్యక్రమంలో జేఈ అనూష, టెక్నికల్‌ అసిస్టెంట్లు రంగనాథ్‌, బాబు పాల్గొన్నారు.

టీబీ అలర్ట్‌ హెల్త్‌ క్యాంప్‌


టీబీ వివరాలు తెలియజేస్తున్న వైద్యాధికారి

నగరి: మండలంలో బుగ్గఅగ్రహారం పీహెచ్‌సీ పరిధిలోని గుండ్రాజుకుప్పం వాటర్‌ ట్యాంకు వీధిలో టీబీ అలర్ట్‌ ఇండియా వారి సహకారంతో గురువారం టీబీ అలర్ట్‌ హెల్త్‌ క్యాంప్‌ ఏర్పాటు చేశారు. 174 మందికి టీబీ, బీపీ, డయాబెటిక్‌, రక్త పరీక్షలు ఇతర ఆరోగ్య సమస్యలపై స్క్రీనింగ్‌ పరీక్షలు చేశారు. తరచూ దగ్గు, జ్వరం రావడం, బరువు దగ్గడం, గళ్లలో రక్తం పడటం లాంటి లక్షణాలు ఉంటే వైద్య పరీక్షలు తప్పనిసరిగా చేసుకోవాలని వైద్యాధికారి రమేష్‌ తెలియజేశారు. 18 టీబీ స్పుటం శాంపిల్‌ కలెక్ట్‌ చేశారు. ఈక్యాంప్‌లో డాక్టర్‌ కీర్తి, సర్పంచ్‌ బాలప్రసాద్‌, ఎంపీహెచ్‌ఎస్‌ శ్రీనివాస్‌, టీబీ అలర్ట్‌, పవన్‌, టీబీహెచ్‌వీ ప్రేమ, సీహెచ్‌ఓలు యామిని, పునిదవల్లి, భాస్కర్‌, చిన్నబ్బరాజు, జయచంద్ర రాజు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆధునిక వైద్య పరికరాల వితరణ


వడమాలపేటలో ఆరోగ్య కేంద్రానికి వైద్య పరికరాలు అందిస్తున్న అధికారులు

వడమాలపేట(విజయపురం): వడమాలపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రోగుల సౌకర్యార్థం అత్యాధునిక వైద్య పరికరాలు వితరణగా అందజేశారు. శుక్రవారం హైదరాబాద్‌కు చెందిన అవేర్‌ హెల్త్‌ అండ్‌ రీసెర్చ్‌ ఫౌండేషన్‌ చైర్మన్‌ మాధవన్‌ ఎస్‌బీఐ సహకారంతో రెండు లక్షల రూపాయల విలువైన హైడ్రాలిక్‌ బెడ్‌లు, ఇంజక్షన్‌ ట్రాలీలు, మెటల్‌ ఎయిర్‌ కూలర్‌ పరికరాలు వితరణగా అందజేశారు. మారుమూల ప్రాంత ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్న లక్ష్యంతో దాత ముందుకు వచ్చి వైద్య పరికరాలు అందించడం సంతోషదాయకమని డాక్టర్‌ చక్రపాణి అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీఐ ఆర్‌ఏ వెంకటేశ్వర రావు, హెచ్‌ఆర్‌ మేనేజర్‌ శివయ్య, స్థానిక బ్రాంచ్‌ మేనేజర్‌ రవికుమార్‌, హెల్త్‌ సూపర్‌ వైజర్‌ చంద్రమోహన్‌ పాల్గొన్నారు.

విస్తారంగా వరి సాగు


పూడిలో సాగు చేసి వరి

వడమాలపేట(విజయపురం): వడమాలపేట మండలంలో వరి సాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఇప్పటికే 190 హెక్టార్లలో వరి సాగు కాగా, మరో 150 హెక్టార్లలో వరి సాగు అవుతుందని వ్యవసాయాధికారి విజయకుమార్‌ తెలిపారు. ఇటీవల వర్షాలు పడి చెరువు, గుంటల్లో నీరు నిలిచి ఉంది. భూగర్భ జలాలు పెరగడంతో ఆరుతడి పంట సాగే చేసే రైతులు సైతం ఈ సారి వరి సాగు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఇప్పటికే వడమాలపేట, పూడి, కాయం, పాదిరేడు, కల్లూరు తదితర గ్రామాల్లో వరి ఎక్కువగా సాగులో ఉంది.


తొలగింపు జాబితాలోని చారిత్రక కొండచుట్టు మండపం


పాక్షికంగా తొలగిస్తున్నట్లు తెలుపుతున్న ఓంశక్తి ఆలయం


తొలగింపు జాబితాలోని మహానేత విగ్రహం

ఆలయాలు కనుమరుగు

జాతీయ రహదారి 205 చెన్నై సెక్షన్‌ 716, 71 తిరుపతి–తిరుత్తణి రోడ్డు నిర్మాణం నగరి మున్సిపల్‌, మండల పరిధిలోని 19 ఆలయాలు, 4 మండపాలు, 3 శిలావిగ్రహాలు, ఒక ఆలయ ప్రవేశ ఆర్చిపై ప్రభావం చూపనుంది. వీటికి సంబంధిత వివరాలను తహసీల్దార్‌ రవి కుమార్‌ ఆలయాల నిర్వాహకులకు అందజేశారు. వీటిలో పలు ఆలయాలు, మండపాలు పూర్తిగా తొలగించనుండగా కొన్ని పాక్షికంగా తొలగించేందుకు ఆస్కారం ఉంది. దీంతో రహదారి వెడల్పులో చారిత్రక ప్రసిద్ధి పొందిన మండపాలతో పాటు ప్రముఖ ఆలయాలు, నాయకుల విగ్రహాల ఉనికి ప్రశ్నార్థకంగా మారింది. ఈ విషయమై సంబంధీకులతో ఈ నెల 28వ తేదీన ఆర్డీఓ కార్యాలయంలో సమావేశం నిర్వహించనున్నారు. –నగరి



అయ్యప్పస్వామి ఆలయం వద్ద మార్కింగ్‌ వేస్తున్న జాతీయ రహదారి సిబ్బంది, (ఇన్‌సెట్‌) తొలగింపు జాబితాలోని అంబేద్కర్‌ విగ్రహం

- జాతీయ రహదారి విస్తరణలో తొలగింపు
- ఆలయాలు, మండపాలు, విగ్రహాలకు ఎఫెక్ట్‌
- ఈ అంశంపై ఈ నెల 28న ఆర్డీఓ కార్యాలయంలో సమావేశం

సాళువ రాజులు నిర్మించిన మండపాలు

తిరుత్తణి నుండి నగరి పట్టణం మీదుగా తిరుమలకు చేరుకునే రహదారిలోని మండపాలు సాళువ రాజుల కాలంలో నిర్మించబడ్డాయి. తదుపరి కార్వేటినగరం జమీందార్ల కాలంలో పరిరక్షించబడ్డాయి. 600 ఏళ్ల చరిత్ర ఉన్నట్లు చెప్పుకునే ఈ మండపాలు అప్పట్లో నడచివెళ్లే బాటసారులకు సేదతీర్చేందుకు నిర్మించినవి. కొన్ని మండపాల్లో సేదదీరడంతోపాటు వంట చేసుకునే సౌకర్యం కూడా ఉంటుంది. వీటిలో నగరిలోని మండపం కొండచుట్టు మండపంగా పేరు గడించింది. వందల ఏళ్ల తరబడి ఈ మండపం వద్ద సంక్రాంతి పండుగ సందర్భంగా దేవతల సందింపు జరుగుతుంది. మండపంలోనే విఘ్నేశ్వర ఆలయం కూడా ఉంది. ఇంతటి ప్రాచుర్యం, గత చరిత్రకు సాక్ష్యాలుగా ఉన్న ఈ మండపాలు రహదారి వెడల్పులో కనుమరుగు కానుంది.

సంబంధీకులు హాజరు కావాలి

జాతీయ రహదారి వెడల్పులో బాధింపునకు గురయ్యే ఆలయాలు, మండపాలు, విగ్రహాల వివరాలు సంబంధీకులకు తెలియజేశాం. ఆలయాలకు సంబంధిత ట్రస్టులు, దేవాలయ చైర్మన్లు, మండపాల నిర్వాహకులు, విగ్రహాలు ఏర్పాటు చేసినవారు ఈ నెల 28న ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించే సమావేశానికి హాజరై వారి అభిప్రాయాలను తెలియజేయాలి. ఇప్పటికే నష్టపరిహారం తీసుకున్న వారు స్వతహాగా వారే తొలగింపులు చేపట్టాలి.

–రవికుమార్‌, తహసీల్దార్‌, నగరి


తొలగింపు జాబితాలోని కీళపట్టు ఆంజనేయ స్వామి ఆలయం

ప్రసిద్ధి చెందిన ఆంజనేయ ఆలయం

దారి దోపిడీకి పాల్పడే ఒక దొంగకు కనువిప్పు కలిగి అతని ద్వారా నిర్మించిన కీళపట్టు ఆంజనేయస్వామి ఆలయం తప్పు చేసినా మార్పు వస్తే ఆలయాలు నిర్మించవచ్చు అని చెప్పేందుకు ప్రతీకగా నిలుస్తోంది. అప్పట్లో మెగా స్టార్‌ చిరంజీవి ఈ ఆలయాన్ని ప్రారంభించారు. ఈ ఆలయం కూడా రహదారి వెడల్పులో తొలగించే జాబితాలో ఉంది. ఇలా భక్తులతో నిత్యం కిటకిటలాడే నగరి ఓంశక్తి ఆలయం, అయ్యప్ప ఆలయాలు కూడా పాక్షికంగా తొలగించే ఆస్కారం ఉంది. ఇలా వీఎస్‌ఆర్‌ పేట, వీకేఆర్‌ పురం గ్రామాల్లోని ఓంశక్తి ఆలయాలు, నెత్తం కండ్రిగలోని కరుమారియమ్మ, భగవతియమ్మ ఆలయాలు, కీళపట్టు భజన మందిరం, తిరుమల పాద యాత్ర భక్తుల విశ్రాంతి భవనం, గుండ్రాజుకుప్పం ముత్తుమారియమ్మ ఆలయం, టీఆర్‌ కండ్రిగ వద్ద అంబేద్కర్‌ విగ్రహం, నగరి బైపాస్‌ వద్ద ఉన్న మహానేత వైఎస్‌ఆర్‌ విగ్రహం, కొండచుట్టు మండపం వద్ద ఉన్న అంబేద్కర్‌ విగ్రహం జాతీయ రహదారి వెడల్పులో తొలగించే జాబితాలో ఉన్నాయి.

27న సదాశివకోన తలనీలాల వేలం

వడమాలపేట (విజయపురం): వడమాలపేట మండలంలోని సదాశివకోనలో మహాశివరాత్రి సందర్భంగా తలనీలాల వేలం ఈ నెల 27వ తేదీ సోమవారం నిర్వహిస్తున్నట్లు ఈఓ జయకృష్ణ గురువారం చెప్పారు. వడమాలపేటలోని వీరాంజనేయ స్వామి ఆలయం వద్ద ఈ వేలం నిర్వహించనున్నారు. ఉదయం 11 గంటలకు వేలం పాట నిర్వహిస్తారు. మహాశివరాత్రి పర్వదినాలలో భక్తులు సమర్పించే తలనీలాలతో పాటు, చిత్రా పౌర్ణమి సందర్భంగా భక్తులు సమర్పించే తలనీలాలు పోగు చేయడం కోసం, కామాక్షి దీపాల సేకరణ కోసం పదివేల రూపాయలు డిపాజిట్‌ చెల్లించాలన్నారు. అలాగే తాత్కాలిక అంగళ్లు, కొబ్బరి చిప్పల సేకరణ కోసం ఐదు వేల రూపాయలు డిపాజిట్‌గా చెల్లించాలని ఆయన తెలిపారు. ఆసక్తి ఉన్న వారు వేలంలో పాల్గొనవచ్చునని ఆయన పేర్కొన్నారు.

చీటీ డబ్బు అడిగినందుకు దాడి కేసు నమోదు

గంగాధరనెల్లూరు: చీటీ డబ్బు అడిగినందుకు వ్యక్తిపై కత్తితో దాడి చేసిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. స్థానిక సీఐ శ్రీనివాసంతి వివరాల మేరకు మండలంలోని వేపంజేరి పంచాయతీ గోవిందరెడ్డిపల్లి గ్రామానికి చెందిన సంతోష్‌కుమార్‌ గ్రామంలో చీటీ నిర్వహించే వారని, ఈ సందర్భంగా అదే గ్రామానికి చెందిన మురళి గత కొద్ది రోజులుగా సంతోష్‌కుమార్‌కు చీటీ డబ్బు కట్టకపోవడంతో ఇంటి వద్ద ఉన్న మురళీని అడగడంతో మాటామాట పెరిగి తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. మురళీ కత్తితో సంతోష్‌కుమార్‌పై దాడి చేశాడని తెలిపారు. ఈ సందర్భంగా సంతోష్‌ కుమార్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీనివాసంతి తెలిపారు.

గొర్రెల్లో బొబ్బర వ్యాధి నివారణకు టీకాలు


గొర్రెలకు వైద్యం అందిస్తున్న డాక్టర్‌

విజయపురం: గొర్రెల్లో బొబ్బర వ్యాధి నివారణకు గొర్రెల పోషకులు టీకాలు వేయించాలని పశువైద్యాధికారి శివశంకర్‌ సూచించారు. గురువారం జీఎం పురంలో ఉచిత పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహించారు. పాడి పశువులకు నట్టల నివారణ మందులను తాగించారు.

శిలాఫలకం ధ్వంసం చేసినవారిని అరెస్టు చేయాలి


మాట్లాడుతున్న జీడీనెల్లూరు సమన్వయకర్త కృపాలక్ష్మి

శ్రీరంగరాజపురం: వైఎస్‌ఆర్‌ సీపీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి శిలాఫలకాలను ధ్వంసం చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని జీడీనెల్లూరు వైఎస్‌ఆర్‌ సీపీ నియోజకవర్గం సమన్వయ కర్త కళత్తూరు కృపాలక్ష్మి డిమాండ్‌ చేశారు. గురువారం తిప్పినాయుడుపల్లి వద్ద దుండగులు ధ్వంసం చేసిన శిలాఫలకాన్ని వెదురుకుప్పం, శ్రీరంగరాజపురం మండల నాయకులతో కలసి సందర్శించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి రాష్ట్రం విధ్వంసాలకు నిలయంగా మారిందన్నారు. శ్రీరంగరాజపురం మండలంలో వైఎస్‌ఆర్‌ సీపీ బ్యానర్లను ధ్వంసం చేశారన్నారు. తిప్పినాయుడుపల్లికి చెందిన అభివృద్ధి పనుల శిలాఫలకంలో ఉన్న వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ముఖ చిత్రాలను ధ్వంసం చేయడం నీచమైన చర్య అన్నారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న అక్రమాలు, అన్యాయాలను ప్రశ్నిస్తే వారిపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని చెప్పారు. వైఎస్‌ఆర్‌ సీపీ ప్రభుత్వంలో ప్రతి పక్ష పార్టీకి చెందిన బ్యానర్లు చించడం, శిలాఫలకాన్ని ధ్వంసం చేయడం ఎన్నడూ లేదని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 7 నెలలు పూర్తి కావస్తున్నా అభివృద్ధిని వదలి కక్ష సాధింపులకు దిగడం సమంజసం కాదన్నారు. రానున్న రోజుల్లో జగనన్న ప్రభుత్వం వస్తుందని, ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడిన వారిపై తీవ్రపరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. వైఎస్‌ఆర్‌ సీపీ శ్రేణుల సహనాన్ని పరీక్షించొద్దని హెచ్చరించారు.

నిందితులను అరెస్టు చేయాలి



గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేసిన శిలాఫలకం, పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న సర్పంచ్‌ రాజశేఖర్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు భాస్కర్‌

వెదురుకుప్పం: అభివృద్ధికి సంబంధించిన శిలాఫలకాన్ని ధ్వంసం చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని తిప్పినాయుడుపల్లి సర్పంచ్‌ రాజశేఖర్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు భాస్కర్‌ డిమాండ్‌ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్‌ రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో ఎంతో మంది ప్రజా ప్రతినిధులు ఎమ్మెల్యేగా, మంత్రులుగా, డిప్యూటీ స్పీకర్‌గా పదవులు అనుభవించారే తప్ప, గ్రామాలు అభివృద్ధి చెందిన దాఖలాలు లేవన్నారు. గతంలో తిప్పినాయుడుపల్లి గ్రామానికి రోడ్డు వసతి ఉండేది కాదని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి సహకారంతో రూ.1.11 కోట్లతో సీసీ రోడ్డు ఏర్పాటు, దళితవాడకు రూ.20 లక్షలతో సీసీ రోడ్డు, జగనన్న కాలనీ, రెండు తాగునీటి బోర్లు, శ్మశాన వసతి, తిరుపతి–కొత్తపల్లి మిట్ట రోడ్డు నుంచి దళితవాడ వరకు వీధి దీపాలు తదితర అభివృద్ధి పనులు చేశామన్నారు. నేడు వాటిని జీర్ణించుకోలేని కొంతమంది కూటమి వ్యక్తులు వీధి దీపాల విద్యుత్‌ తీగలను కట్‌ చేసి, అభివృద్ధి సూచక శిలాఫలకాన్ని ధ్వంసం చేయడం నీచమైన చర్య అన్నారు. స్థానిక ఎమ్మెల్యే డాక్టర్‌ థామస్‌ శిలాఫలకాన్ని ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకుని, టీడీపీలో ఉన్న అలాంటి వారిని దూరం పెట్టాలన్నారు. స్థానిక ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకుని శ్మశానం భూమిని సర్వే చేయించి, దళితులకు అప్పగించాలని ఎంపీటీసీ సభ్యుడు భాస్కర్‌ డిమాండ్‌ చేశారు. అనంతరం నిందితులను అరెస్టు చేయాలని పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.


లక్ష్మమ్మ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న కృపాలక్ష్మి

మాజీ ఎంపీపీ కుటుంబానికి పరామర్శ

వెదురుకుప్పం: మండలంలోని దామరకుప్పం గ్రామంలో మాజీ ఎంపీపీ అరుణ కుటుంబాన్ని గంగాధరనెల్లూరు నియోజకవర్గ ఇన్‌చార్జి కృపాలక్ష్మి పరామర్శించారు. ఇటీవల వృద్ధురాలు లక్ష్మమ్మ మృతి చెందగా గురువారం కర్మక్రియలు జరిగింది. లక్ష్మమ్మ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి యోగక్షేమాలను తెలుసుకున్నారు. ఆమె వెంట జెడ్పీటీసీ సభ్యుడు సుకుమార్‌, ఎంపీటీసీ గుణశేఖర్‌, మాజీ వైస్‌ ఎంపీపీ ధనుంజయరెడ్డి, వైఎస్‌ఆర్‌ సీపీ యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనుంజయరెడ్డి, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి రామయ్య, వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు బండి హేమసుందర్‌రెడ్డి, ప్రచార విభాగం జిల్లా అధ్యక్షుడు బట్టే సుబ్రమణ్యం, జిల్లా స్టీరింగ్‌ కమిటీ సభ్యుడు శివాజీ, బొమ్మయ్యపల్లె సర్పంచ్‌ గోవిందయ్య, యువత మాజీ మండల అధ్యక్షుడు నరేష్‌ రెడ్డి, సచివాలయ కన్వీనర్‌ జగదీశ్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు ఈశ్వర‌రెడ్డి, గోవిందన్‌, సింగిల్‌విండో మాజీ డైరెక్టర్‌ మునికృష్ణారెడ్డి, నాయకులు పరంధామరెడ్డి, వెంకటేశ్‌, కార్యకర్తలు ఉన్నారు.

వర్కర్స్‌ కాలనీ ఏర్పాటు చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న కోదండయ్య

నగరి: పట్టణంలో ఉన్న పేదలకు కార్మికులకు ఇంటి స్థలాలు కేటాయించి వర్కర్స్‌ కాలనీ ఏర్పాటు చేయాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి కోదండయ్య డిమాండ్‌ చేశారు. రాష్ట్ర సమితి పిలుపు మేరకు బుధవారం పట్టణ పార్టీ కార్యదర్శి వేలన్‌, మురళి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మున్సిపాలిటీలో పనిచేయు కార్మికులకు ఇంటి స్థలాలు కేటాయించి పక్కా గృహాలు నిర్మించి ఇవ్వాలన్నారు. పట్టణంలో ఉన్న పేద కార్మికులకు రెండు సెంట్లు, గ్రామాల్లో ఉన్న కార్మికులకు మూడు సెంట్లు ఇవ్వాలని గృహ నిర్మాణానికి ఐదు లక్షల రూపాయలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు బాషా, విజయ్‌కుమార్‌, మున్సిపల్‌ వర్కర్స్‌ యూనియన్‌ నాయకులు సెల్వి, రాజేష్‌ సుబ్రహ్మణ్యం, నాగరాజు, దీప, గ్రీన్‌ అంబాసిడర్లు తదితరులు పాల్గొన్నారు.

రఘునాథరెడ్డికి ఘన నివాళి


రఘునాథరెడ్డి మృతదేహానికి నివాళులర్పిస్తున్న కృపాలక్ష్మి

శ్రీరంగరాజపురం: మండలంలోని ఎస్‌.ఆర్‌.పురం గ్రామానికి చెందిన సర్పంచుల సంఘ అధ్యక్షుడు దిలీప్‌రెడ్డి తండ్రి వైఎస్‌ఆర్‌ సీపీ నాయకుడు రఘునాథరెడ్డి అనారోగ్యంతో మరణించారు. సమాచారం అందుకున్న గంగాధరనెల్లూరు నియోజకవర్గం ఇన్‌చార్జ్‌ కృపాలక్ష్మి మృతదేహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి వైఎస్‌ఆర్‌ సీపీ తరపున ఆదుకుంటామని భరోసా కల్పించారు. ప్రతి ఒక్క వైఎస్‌ఆర్‌ సీపీ నాయకులకు, కార్యకర్తలకు అందుబాటులో ఉండి,వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఆమె వెంట వైఎస్‌ఆర్‌ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు గురవారెడ్డి, మండల కన్వీనర్‌ మణి, ఎంపీపీ సరిత, జిల్లా కార్యదర్శి కుప్పయ్య, జనార్దన్‌, కాళప్ప, హరిరెడ్డి, అశోక్‌, మణి, బాబు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మెళకువలు పాటిస్తే అధిక దిగుబడులు


చెరుకు దిగుబడిని పరిశీలిస్తున్న ఏఓ హేమలత

కార్వేటినగరం: చెరుకు సాగులో మెళకువలు పాటిస్తే అధిక దిగుబడి సాధ్యమని మండల వ్యవసాయ అధికారి ఆర్‌.హేమలత అన్నారు. గురువారం మండల పరిధిలోని ఎంఎం విలాసంలో చెరకు ఒబ్బిడిని పరిశీలించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ చెరకు సాగు రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలను పాటిస్తే ఎకరాకు 40 నుంచి 50 టన్నుల వరకు దిగుబడిని సాధించవచ్చని పేర్కొన్నారు. చెరకు పంట సాగుకు జనవరి నుంచి మార్చి వరకు అనుకూలమైందని సకాలంలో ఎరువుల వాడకంతో మంచి దిగుబడిని సాధించవచ్చని. వ్యవసాయ అధికారుల సూచనల మేరకు మేలు రకం చెరకు రకాన్ని ఎంపిక చేసుకోవాలని సూచించారు. అనంతరం మండల పరిధిలోని అన్నూరు రైతు సేవా కేంద్రాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. వారి వెంట ఏఈఓ హేమాద్రి, రైతు సేవా కేంద్రం సిబ్బంది తదితరులు ఉన్నారు.

300 మంది పిల్లలకు ప్లేట్లు, గ్లాసులు పంపిణీ


పిల్లలకు ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేస్తున్న దాతలు

వెదురుకుప్పం: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు కాపుమొండి వెంగనపల్లె గ్రామానికి చెందిన దాతలు సాయిరెడ్డి, భూపతిరెడ్డి పంపిణీ చేశారు. మూడో తరగతి నుంచి ఆరో తరగతి విద్యార్థులు 300 మందికి ఉచితంగా ప్లేట్లు, గ్లాసులు, కప్పులు, అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ దామోదరం మాట్లాడుతూ దాతల సహాయ సహకారాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యార్థులకు ఇలాంటి వస్తువులు వితరణ చేయడం అభినందనీయమన్నారు. మానవతా దృక్పథంతో విద్యార్థులకు ఇలాంటి సేవలతో అండగా నిలవడం గొప్పదన్నారు. అనంతరం దాతలను ఘనంగా సత్కరించారు. అదేవిధంగా చవటగుంట ప్రభుత్వ జూనియర్‌ కళాశాలలోని విద్యార్థులకు చెన్నైకి చెందిన ప్రసన్నకుమార్‌ సహకారంతో విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు, కప్పులు అందజేశారు. కళాశాల ప్రిన్సిపల్‌ వసంత్‌ కుమార్‌, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆర్థికంగా అభివృద్ధి చెందాలి


ఐకేపీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న కల్పలతరెడ్డి

పాలసముద్రం: ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా మహిళలకు సత్వర రుణాలను అందిస్తూ లాభాల బాటలో నడుస్తున్న ఏకైక సహకార సంస్థ స్త్రీనిధి, ఉన్నతి అని ఐకేపీ ఏపీఎం కల్పలతరెడ్డి తెలిపారు. గురువారం ఐకేపీ కార్యాలయంలో తమ సిబ్బందికి సమావేశం నిర్వహించారు. ఏపీఎం కల్పలతరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం మరిన్ని ఎక్కువ రుణాలు అందించేలా స్త్రీనిధి సంస్థను మెరుగు పరిచే బాధ్యత మహిళలపై ఉందన్నారు. మహిళల ఆర్థికాభివృద్ధికి ఏర్పాటు చేసిన ఉన్నతి, స్త్రీనిధి సంస్థకు పూర్తి స్థాయి యజమానులు మహిళలేనని తెలిపారు. బ్యాంకు లింకేజీల ద్వారా అందిస్తున్న రుణాలను సంఘ సభ్యులు సద్వినియోగం చేసుకుని అభివృద్ధి చెందాలన్నారు. గ్రూప్‌లో తీసుకుని పలు రకాల రుణాలను కొట్టివేతలు లేకుండా రికార్డు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో సీసీ చిరంజీవి, సంఘమిత్ర, శోభ, మంజుల, మురగయ్య, బాలయ్య, మంజుల పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలి


మహాసభ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

శ్రీరంగరాజపురం: కూటమి ప్రభుత్వం కార్మికులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కోదండయ్య అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల నిర్వహించిన ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం సంఘటిత, అసంఘటిత కార్మికులకు మోసపూరితమైన హామీలను ఇచ్చి గెలిచి ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు అవుతున్నా ఇంత వరకు నెరవేర్చడం లేదన్నారు. ఆశ, అంగన్‌వాడీ, స్కూల్‌ ఆయాలకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. బిల్డింగ్‌ కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తే ప్రస్తుత కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందన్నారు. అర్హులైన ప్రతి కార్మికుడికి 3 సెంట్లు స్థలం కేటాయించి ఇళ్లు మంజూరు చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుపై ఫిబ్రవరి 2వ తేదీ శ్రీరంగరాజపురం మండల కేంద్రం వద్ద నిర్వహించనున్న కార్మికుల మహాసభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి జిల్లా గ్రీన్‌ అంబాసిడర్‌ జిల్లా కార్యదర్శి గోవిందస్వామి, ఆటో యూనియన్‌ కార్యదర్శి మోహన్‌, కుప్పయ్య, మంజుల, ఇంద్రాణి, చిన్నబ్బ తదితరులు పాల్గొన్నారు.